క్లుప్తంగా

పౌరహక్కులు తెలుసుకోండి



పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: పౌరులు తమ హక్కుల గురించి తెలుసుకుని, వాటికి అనుగుణంగా సమాజంలో జీవించాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రేగాటిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి జీవించే హక్కు ఉంటుందన్నారు. వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగినా అధికారులకు తెలియజేయాలన్నారు. గొడవలకు దూరంగా ఉండాలని, ప్రజలందరూ కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కుల్లాయప్ప, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరి విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: హిందూపురం ఎంజీఎం స్కూల్లో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన గ్రాప్లింగ్, రెజ్లింగ్ చాంపియన్‌షిప్ –2025 పోటీల్లో గి, నోగి విభాగాల్లో కదిరి విద్యార్థులు పతకాలు సాధించారు. కదిరి విద్యార్థులు సిరి, నిఖిత, డిమ్మశ్రీ, ఐమన్, ఆశీర్వాద్, కిరణ్, ప్రెగ్నేష్, యశ్వంత్, జగదీష్, కేశవర్ధన్‌లు గి, నోగి విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో హిందూపురం డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్‌కరీంలు, మార్షల్ ఆర్ట్స్ ఫిలాసఫర్ డా.మురళీకృష్ణ, కోచ్ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు 15 బస్తాల దిగుబడి



వేరుశనగ పొలంలో దిగుబడి అంచనా వేస్తున్న అధికారులు

ఎన్పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో ఎకరాకు 15 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం వంకమద్ది గ్రామంలో సహాయ గణాంక అధికారి గంగాద్రి ఆధ్వర్యంలో రైతు ఉత్తయ్య వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టారు. సరాసరి 5.5 కేజీల దిగుబడి నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ సునీత, మాజీ సర్పంచ్ నరసింహులు, రైతులు పాల్గొన్నారు.


మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓడీచెరువు (అమడగూరు) : మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి సూచించారు. అమడగూరు మండలం కస్సముద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రతి మహిళా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనేదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాబా ఫక్రుద్దీన్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లికి చెందిన శివానంద చీరల వ్యాపారం నిమిత్తం సోమవారం కారులో ధర్మవరానికి బయలుదేరాడు. ముదిగుబ్బ దాటగానే టైరు పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న శివానంద స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

స్పందించరు.. సమాచారమివ్వరు

- మున్సిపల్ అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కౌన్సిల్ సమావేశం బాయ్‌కాట్
- హఠాత్పరిణామంతో కంగుతిన్న మున్సిపల్ అధికారులు



మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ సభ్యులు

ధర్మవరం: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చించే అజెండాల ప్రతిని ఒక్క రోజు ముందుగా కూడా ఇవ్వరని, ప్రజా సమస్యల గురించి ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని, వీరి పనితీరుకు నిరసనగా సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని ముఖ్యాంశాలు చదువుతుండగానే కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలను ముందస్తుగా తెలపకుండా హడావుడి ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం చేపట్టి.. అప్పటికప్పుడు అజెండా ప్రతులను అధికారులు కౌన్సిలర్‌కు ఇస్తే ఏం అవగాహన ఉంటుందని నిలదీశారు. మున్సిపాలిటీలో జరిగే పలు కీలక పనులను చైర్‌పర్సన్‌కు కూడా తెలియకుండా అజెండాలో పెట్టడం, కనీసం వార్డులో కౌన్సిలర్‌లు తమ వార్డు సమస్యలను పరిష్కరించాలని అజెండాలో పెట్టాలని కోరితే పట్టించుకోక పోవడంలో అంతర్యమేమిటని ఇన్‌చార్జ్ కమిషనర్‌ని ప్రశ్నించారు. అంతేకాక ప్రతి నెలా నిర్దిష్ట తేదీ అంటూ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అధికారుల అహంకార వైఖరి కారణంగా మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, అభివృద్ధి కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు లబ్ధి చేకూర్చే అంశాలకే ప్రాధాన్యం ఇవ్వడం, ప్రజల సమస్యలను విస్మరించడం, కౌన్సిల్ సభ్యులనే కాక సభాపతి స్థానంలో ఉన్న చైర్‌పర్సన్‌నూ అవమానిస్తున్న మున్సిపల్ అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, అందుకే కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి ప్రకటించారు. ఇందుకు చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్‌చైర్మన్‌లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగంతో పాటు కౌన్సిలర్‌లు మద్దతు తెలపడంతో సభ ప్రారంభమవ్వకుండానే పాలకవర్గం ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అనంతరం పాలకవర్గ సభ్యులంతా మున్సిపల్ కార్యాలయం ఎదుట అధికారుల తీరును నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ హఠాత్పరిణామంతో మున్సిపల్ అధికారులు నివ్వెరపోయారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, జేసీబీ రమణ, పెణుజూరు నాగరాజు, మేడాపురం వెంకటేశ్, చింతా యల్లయ్య, గజ్జల శివ, అత్తార్ జిలాన్, ఎస్పీ షకీల, కడప రంగస్వామి, కేతా లోకేష్, కోటిరెడ్డి సుజాత, బోయ రమాదేవి, చౌడం సుబ్బలక్ష్మి, కత్తె ఆదిలక్ష్మి, గడ్డం వరలక్ష్మి, కేశగాళ్ల రామలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు బూశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఐలూ సంఘం సభ్యులు, న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం న్యాయవాదులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అఖిల భారత న్యాయవాదుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇడపబత్తిని ప్రసాద్, బార్ అసోసియేషన్ ట్రెజరర్ అబ్దుల్‌సాబ్ విమర్శించారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టబోయే శాంతియుత నిరసన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐలూ నాయకులు వీరమాసప్ప, సతీష్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేస్తం పథకం ద్వారా జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు గౌరవ వేతనం ఇచ్చేవారన్నారు. కూటమి నేతలు న్యాయమిత్ర పథకం ద్వారా రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదన్నారు. రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి ఆర్థిక తోడ్పాటుతోపాటు రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.15 లక్షలతో ప్రమాద బీమా అందేలా చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ అమలు ప్రస్తావనే లేదన్నారు. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ లైబ్రరీ, జ్యుడీషియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, జూనియర్ న్యాయవాదులకు వృత్తిలో స్థిరపడటానికి ల్యాప్‌టాప్, ప్రింటర్‌లు, వడ్డీలేని రుణాలు సబ్సిడీతో అందించాలని, హెల్త్‌కార్డుల మంజూరు, డెత్ బెనిఫిట్స్ తెలంగాణ తరహాలో అమలు చేసి న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బిల్లే రవి, నరసింహమూర్తి, పెద్దన్న, బాబు, మోహన్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పురం'లో వైఎస్సార్‌సీపీ నిరసన

మడకశిర: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం హిందూపురం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నిరసన చేపట్టనుంది. హిందూపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు నిరసన చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శతజయంతి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం



భూమి పూజ చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దామని కలెక్టర్ శ్యాంప్రసాద్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే. రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. శతజయంతి ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో సోమవారం పుట్టపర్తిలో రూ.12 కోట్లతో రోడ్లు, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులతో పాటో పలువురు ప్రముఖులు, వీవీఐపీలు, వీఐపీలు హాజరవుతారన్నారు. ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి వెస్ట్‌గేట్ నుంచి వడ్డి వంక మీదుగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు రోడ్డు మరమ్మతు పనులకు భూమి పూజ చేసినట్లు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ క్రాంతి కుమార్, డీఈ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ అమర్చక పంట ఎండుముఖం



కనెక్షన్ కోసం సిద్ధంగా ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతు నరేశ్వరరెడ్డి

ఎన్పీకుంట: విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడంలో జాప్యం చేస్తుండటంతో పంట ఎండుముఖం పడుతోందని టీఎస్ కొత్తపల్లికి చెందిన రైతు ఆసం నరేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పొలానికి విద్యుత్ కనెక్షన్ కోసం 40 రోజుల కిత్రం ట్రాన్స్‌ఫార్మర్ తీసుకున్నానని తెలిపారు. అయితే అధికారులు ఇంతవరకూ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. సకాలంలో నీరందక పంట ఎండుముఖం పడుతుండటంతో చూడలేక 1912 హెల్ప్‌లైన్ ద్వారా పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. నిబంధనల ప్రకారం నెలలోగా విద్యుత్ సరఫరా కల్పించాల్సిన బాధ్యత డిస్ట్రిబ్యూషన్ లైసెన్సీలదేనన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈఈ సాలెహాబాషాను వివరణ కోరగా.. అదే గ్రామానికి చెందిన మరో ఇరువురు రైతులు గొడవపడి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, వారు సహకరించకుంటే మరో రెండు రోజులలో పోలీస్ ప్రొటెక్షన్‌తో ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తామని చెప్పారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: పట్టణ పరిధిలో సర్వే నంబర్ 1778–1లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆర్పీపీఐ జిల్లా కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. పట్టాలు మంజూరు చేయడంతో పాటు కాలనీలో తాగునీరు, వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, గుజ్జల శేఖర్, విద్యార్థి సంఘం నాయకులు అరుణ్‌కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓపీ సేవల బహిష్కరణ



నల్లబ్యాడ్జీలతో హాజరైన డాక్టర్

గాండ్లపెంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సోమవారం ఓపీ సేవలు బహిష్కరించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి అందించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఓపీ సేవలను బహిష్కరించనున్నట్లు వైద్యులు మహేశ్వరమారుతి, బాబాఫక్రుద్దీన్ తెలిపారు. కాగా కటారుపల్లిలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ పథకం కింద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి సైతం వైద్యులు గైర్హాజరయ్యారు. వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ రష్మీ, ఏఎన్‌ఎంలు రోగులకు వైద్య సేవలు అందించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కనగానపల్లి: కూటమి ప్రభుత్వ నిర్లక్ష వైఖరికి నిరసనగా రాప్తాడు నియోజక వర్గంలోని పలు పీహెచ్‌సీల డాక్టర్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, రాప్తాడు మండలాల్లో వైద్యులు విధులకు హాజరైనప్పటికీ ఎమర్జెన్సీ కేసులకు మాత్రమే సేవలందించారు.

నల్లచెరువు: మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ఇన్ సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించారు. దీంతో రోగులు చికిత్సలు అందక ఇబ్బందులు పడ్డారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, మహిళలు

కదిరి టౌన్: పట్టణంలోని కందికుంట నారాయణమ్మ కాలనీలో న్యూ అమీన్‌నగర్, బాబా కాలనీ, శ్రీరామ్ నగర్‌లో దాదాపు మూడు వేల జనాభా ఉందని, 300 మంది దాకా చిన్నపిల్లలు ఉన్నారని, అక్కడ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు రేషన్‌షాపులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, రమణయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించండి

ఓడీచెరువు: సున్నంపల్లి పంచాయతీలో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ ఉన్న 12 నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు రమణ కోరారు. ఈ మేరకు సోమవారం కార్మికులతో కలిసి పంచాయతీ కార్యదర్శి పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఏడాదిగా జీతం ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుళ్లాయప్ప, స్వచ్ఛ భారత్ కార్మికులు రమణప్ప తదితరులు పాల్గొన్నారు

మౌలిక సదుపాయాలు కల్పించండి

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డీఆర్‌ఓను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బ్రాహ్మణపల్లి లేఔట్‌లో 1,500 ఇళ్లు ఉన్నాయని, వీధిలైట్లు, రోడ్లు, తాగునీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఆర్‌ఓ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించి మౌలిక సదుపాయలు సమకూర్చుతామని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి

పుట్టపర్తి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ జయంతి సిబ్బందికి సూచించారు. సోమవారం బుక్కపట్నంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ పుష్పలతతో కలిసి ఆమె పరిశీలించారు. సకాలంలో పౌష్టికాహారం అందించి, తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న మసీదు కమిటీ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని మారుతినగర్‌లో నివసిస్తున్న పెయింటర్ అల్తాఫ్ బాషా, ఫర్జానా దంపతుల కుమార్తె షేక్ షబీనా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మదీనా మసీదు కమిటీ సభ్యులు సోమవారం వారి ఇంటికి వెళ్లి మసీదులో చందా రూపంలో సేకరించిన రూ.41,600 నగదును వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. కాలేయ మార్పిడికి రూ.20లక్షల వరకు ఖర్చవుతుందని బెంగళూరులోని ప్రైవేట్ వైద్యులు తెలిపారని, ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని షబీనా కుటుంబ సభ్యులు కోరారు.

పారిశుధ్యం మెరుగుపర్చండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా

కదిరి టౌన్: పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. 36 వార్డుల్లోనూ కాలువలు శుభ్రం చేయాలని, చెత్త లేకుండా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల వైభవం

సాక్షి బృందం: దసరా శరన్నవరాత్రుల వైభవం కొనసాగుతోంది. ఎనిమిదో రోజు సోమవారం అమ్మవారు సరస్వతీదేవి తదితర రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రత్యేక పూజలు, భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానాలు నిర్వహించారు.




పుట్టపర్తిలో సరస్వతీ దేవిగా వాసవీమాత



సరస్వతీ దేవి అలంకరణలో మల్లాలమ్మ




మోహినీ అలంకరణలో వేంకటేశ్వరస్వామి



దాడితోటలో చదువుల తల్లిగా పెద్దమ్మ




సరస్వతి దేవి రూపంలో లలిత త్రిపుర సుందరీదేవి



తలుపులలో సరస్వతీదేవి అలంకారంలో..



ముదిగుబ్బలో సరస్వతీదేవిగా వాసవీమాత



శ్రీఖాద్రీ ఆలయంలో సరస్వతీదేవి అలంకారం



మహాగౌరీదేవి అవతారంలో చౌడేశ్వరి మాత



జానకంపల్లిలో సరస్వతీ దేవి ఆకారంలో రేణుకా యల్లమ్మ

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

కదిరి టౌన్: ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కుటాగుళ్లకు చెందిన విజయ్‌కుమార్ ఆర్టీసీ బస్టాండ్ దగ్గర అంబేడ్కర్ సర్కిల్‌లో అనుమతులు లేకుండా టపాసులు కాలుస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వద్ద బైండవర్ చేసేందుకు నోటీసులు ఇచ్చామన్నారు. పట్టణంలో ఎటువంటి కార్యక్రమాలైనా పోలీసులతో ముందస్తు అనుమతులు పొందాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల నూతన కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఈఓ నరసింహరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. భక్తరపల్లి ఆలయ ఆవరణలో కమిటీ చైర్మన్‌గా నర్సేగౌడుతో పాటు సభ్యులతో దేవాలయశాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సర్పంచులు కరియన్న, రామాంజినేయులు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు అధ్యక్షుడు గురుమూర్తి తదిరతులు పాల్గొన్నారు.